www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 5 జూన్ 2023

5

పశ్చిమ గోదావరి



ప్రశాంతంగా జెఇఇ అడ్వాన్స్డ్ ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఐఐటిల్లో ప్రవేశాలకుగాను దేశవ్యాప్తంగా నిర్వహించే జెఇఇ అడ్వాన్స్డ్ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. దీనికి సంబంధించిన వివరాలను శ్రీ వాసవి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రత్నాకరరావు వెల్లడించారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 970 మంది అభ్యర్థులు పరీక్షకు దరఖాస్తు చేసుకోగా వారికి ఏడు సెంటర్లలో పరీక్షా కేంద్రాలను కేటాయించారని వివరించారు. తాడేపల్లిగూడెం శ్రీ వాసవీ ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రంలో 228 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారని, 12 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. పరీక్షా కేంద్రం కోఆర్డినేటర్ నటరాజ్, సిస్టమ్స్ అడ్మిన్ కొల్లా సురేష్, టిసిఎస్ సంస్థ ప్రతినిధులు పరీక్ష నిర్వహణను పర్యవేక్షించారు.

ఏరువాక సాగేదెప్పుడో..!



ముందస్తు సాగుపై నీలినీడలు

1న కాలువలకు సాగునీరు విడుదల

జిల్లాకు రోజుకు 500 క్యూసెక్కుల నీరు

వడగాల్పులతో అననుకూల వాతావరణం

నారుమడులు వేసేందుకు రైతులు వెనుకంజ

సాగునీరు విడుదల చేశాక తూడు తొలగింపు

పనులపై విమర్శలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఖరీఫ్ ముందస్తు సాగుపై నీలినీడలు కమ్ముకున్నాయి. జూన్ ఒకటిన కాలువలకు సాగునీరు విడుదల చేసినప్పటికీ నారుమడులు వేసేందుకు రైతులు ముందుకు రాని పరిస్థితి నెలకొంది. దీనికి ప్రధాన కారణం వేసవి తీవ్రత తగ్గకపోవడం, వడగాల్పులతో వాతావరణ పరిస్థితులు ఆందోళనకరంగా ఉండటమేనని చెప్పొచ్చు. జూన్ ఒకటిన సాగునీరు విడుదల చేసి ఖరీఫ్‌లో ముందస్తు సాగు చేపడితే నవంబర్, డిసెంబర్‌ల్లో విరుచుకుపడే తుపాన్ల బారిన పడకుండా పంటను కాపాడుకోవచ్చునని ప్రభుత్వం ఆలోచన చేస్తోంది. అందులో భాగంగానే కొన్నేళ్లుగా జూన్ ఒకటో తేదీన పంట కాలువలకు సాగునీరు విడుదల చేస్తోంది. వాతావరణ పరిస్థితుల రీత్యా ప్రభుత్వ ఆలోచన ముందుకు సాగని పరిస్థితి నెలకొంది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఖరీఫ్‌లో దాదాపు నాలుగు లక్షల ఎకరాల్లో రైతులు వరి సాగు చేసేందుకు సిద్ధమవుతున్నారు. అందుకు సంబంధించి విత్తనాలు సైతం సిద్ధం చేసుకున్నారు. ప్రభుత్వం ప్రకటించిన విధంగానే జూన్ ఒకటిన సాగునీరు విడుదల చేశారు. ప్రస్తుతం రోజుకు 500 క్యూసెక్కుల నీటిని కాలువలకు విడుదల చేస్తున్నట్లు ఇరిగేషన్ అధికారులు చెబుతున్నారు. నారుమడులు ఆరంభిస్తే సాగునీరు విడుదల మరింత పెంచనున్నారు. కనీసంగా జూన్ 20వ తేదీకి నారుమడులు వేయడం పూర్తయితేనే ముందస్తు సాగు ప్రణాళిక విజయవంతమవుతుంది. అయితే వాతావరణ పరిస్థితి అందుకు అనుకూలంగా కన్పించడం లేదు. జూన్ మొదటివారం పూర్తవుతున్నా వేసవి తీవ్రత ఏమాత్రం తగ్గలేదు. ఇప్పటికీ ప్రతిరోజు 43 డిగ్రీలపైనే ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. వేడిగాలులకు ఇంట్లోంచి బయటకు రావాలంటేనే భయపడే పరిస్థితి నెలకొంది. ఈ తరుణంలో నారుమడులు వేసినా దెబ్బతినే ప్రమాదం ఉంది. వర్షాలు పడితే తప్ప రైతులు నారుమడులు వేసే అవకాశం లేదు. నైరుతి రుతుపవనాలు ప్రవేశించి వాతావరణం చల్లబడితే తప్ప ఏరువాకకు రైతులు సిద్ధమయ్యే పరిస్థితి కనిపించడం లేదు. దీంతో కాలువలకు సాగునీరు విడుదల చేసినా రైతులు నారుమడుల గురించి ఆలోచించే పరిస్థితి లేకుండాపోయింది. దీంతో ఈ ఏడాది కూడా ఖరీఫ్ సాగు ఆలస్యంగానే ప్రారంభమయ్యే పరిస్థితి కన్పిస్తోంది. అదే జరిగితే ఖరీఫ్‌సాగుతోపాటు రబీ సాగు సైతం ఆలస్యయ్యే పరిస్థితులు ఏర్పడనున్నాయి.

కాలువకు నీరు విడుదలయ్యాక తూడు పనులేమిటీ

ఈ ఏడాది కూడా ప్రభుత్వం ఆధునికీకరణ పనులకు తిలోదకాలిచ్చేసింది. ఎక్కడా ఒక్క రూపాయి విలువ చేసే ఆధునికీకరణ పనులు చేయలేదు. కాలువలు ఎక్కడికక్కడే మెరక తేరిపోయాయి. కాలువలన్నీ తూడు, గుర్రపుడెక్కతో పూడుకుపోయాయి. సాగునీరు విడుదల చేసినా కిందకు పారని పరిస్థితి నెలకొంది. తూడు తొలగింపు పనులకు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా రూ.18 కోట్లు వరకూ మంజూరైనట్లు తెలుస్తోంది. ఇప్పటి వరకూ పనులు ప్రారంభించకుండా కాలువలకు సాగునీరు విడుదల చేశక తూడు తొలగింపు పనులు ప్రారంభించారు. కాలువల్లో నీరు ఉన్నప్పుడు చేసే పనుల్లో నాణ్యత ఉండదని రైతులు చెబుతున్నారు. కాలువల్లో నీరు తక్కువగా ఉన్నప్పుడు తూడు, గుర్రపు డెక్క, క్రనాచు వంటివి వేరులతో సహా తీయడానికి వీలుంటుందని చెబుతున్నారు. అదే కాలువల్లో నిండుగా నీరుంటే ఏదో మమ అనిపించే రీతిలో తూడు తొలగింపులు జరిపేస్తారనే విమర్శలు విన్పిస్తున్నాయి. తూడు తొలగింపు పేరుతో రూ.కోట్లు ఖర్చు చేసినా రైతులకు పెద్దగా ప్రయోజనం లేకుండా పోతుందని వాపోతున్నారు. తూడు తొలగింపు పనులు ఎప్పటికి పూర్తవుతాయో వేచిచూడాలి.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న జెసి, ఎస్‌పి, అధికారులు

సిఎం పోలవరం పర్యటనకు పటిష్ట బందోబస్తు

ఏలూరు జెసి లావణ్యవేణి

ప్రజాశక్తి - పోలవరం

పోలవరంలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పర్యటనకు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి పోలీసు అధికారులను ఆదేశించారు. ఈ నెల ఆరో తేదీన పోలవరం ప్రాజెక్ట్ పనుల పరిశీలనకు ముఖ్యమంత్రి విచ్చేస్తున్న దృష్ట్యా ఆయన పర్యటించే ప్రాంతాల్లో ఏర్పాట్లను అధికారులతో కలిసి ఆదివారం జెసి పరిశీలించారు. ఈ సందర్భంగా జెసి లావణ్యవేణి మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటన కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అధికారులందరూ సమన్వయంతో పని చేయాలన్నారు. ఆరో తేదీ ఉదయం 10.20 నిముషాలకు ముఖ్యమంత్రి హెలీకాప్టర్‌లో పోలవరం ప్రాజెక్ట్ సైట్‌కు చేరుకుంటారని, ప్రజాప్రతినిధులను కలుసుకున్న అనంతరం, ఎగువ కాపర్ డ్యామ్, దిగువ కాపర్ డ్యామ్, డయాఫ్రమ్ వాల్, ఎర్త్ కం రాక్ ఫిల్ డ్యామ్‌లో పనులను పరిశీలిస్తారన్నారు. అనంతరం ప్రాజెక్ట్ సైట్‌లోని సమావేశపు హాలుకు చేరుకుని అధికారులు, ఇంజినీర్లతో ముఖ్యమంత్రి సమీక్షిస్తారన్నారు. ప్రాజెక్ట్ నిర్మాణ పనుల ప్రగతికి సంబంధించి ఫొటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయాలని జలవనరుల శాఖ అధికారులను జెసి ఆదేశించారు. వేసవి దృష్ట్యా ఆయా ప్రదేశాల్లో టెంట్లు, తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎస్‌పి మేరీప్రశాంతి, అసిస్టెంట్ కలెక్టర్లు అపూర్వ భరత్, శ్రీపూజ, ప్రాజెక్ట్ చీఫ్ ఇంజినీర్ సుధాకర్‌బాబు, ఆర్‌డిఒలు కె.పెంచల్‌కిషోర్, ఝాన్సీరాణి, ఉద్యాన శాఖ డిప్యూటీ డైరెక్టర్ రవికుమార్, తహశీల్దార్ సుమతి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించే వరకూ పోరు

రాష్ట్ర జాతాలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు



భీమవరంలో మాట్లాడుతున్న మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి - భీమవరం

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కారమయ్యే వరకూ ఆందోళన ఆపేది లేదని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు అన్నారు. ఇచ్ఛాపురంలో ప్రారంభమైన యాత్ర ఆదివారం జిల్లాలో ప్రవేశించి తణుకు, నరసాపురం, పాలకొల్లు మీదుగా సాయంత్రానికి భీమవరం చేరుకుంది. ఈ సందర్భంగా మున్సిపల్ వర్కర్స్ కాలనీలో నిర్వహించిన సభలో ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు చేస్తున్న పనులు మరెవరు చేయలేరని, ఆ విషయం ప్రభుత్వానికీ తెలుసని, అయినప్పటికీ మున్సిపల్ కార్మికుల శ్రమను గుర్తించకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోందని విమర్శించారు. జగన్ పాదయాత్ర సందర్భంగా మున్సిపల్ కార్మికుల సమస్యలు అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లోనే పరిష్కారం చేస్తానని చెప్పారని గుర్తు చేశారు. కనీస వేతనాలు, సబ్బులు, నూనెలు, చెప్పులు, యూనిఫామ్ వంటి సౌకర్యాలు కూడా కల్పించడం లేదని విమర్శించారు. ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలను పోరాటాల ద్వారా ఎదుర్కోవాల్సిన అవసరం ఉందన్నారు. ఇంత జరుగుతున్నా రాష్ట్రంలో ప్రతిపక్ష పార్టీలుగా ఉన్న తెలుగుదేశం, జనసేన తేలు కుట్టిన దొంగల్లా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. ఓట్లు, సీట్లు లెక్కలు తప్ప ప్రజలు పడుతున్న బాధలను పట్టించుకోవట్లేదన్నారు. కార్యక్రమానికి సిఐటియు పట్టణ అధ్యక్షులు శిరీస్ కుమార్ అధ్యక్షత వహించగా టి.నూకరాజు, ధనాల వెంకటరావు, జి.లక్ష్మి, జి.నాయుడు, వరలక్ష్మి, బి.సోమయ్యతోపాటు జిల్లా నాయకులు కర్రి నాగేశ్వరరావు, కె.రాజారామ్మోహన్‌రాయ్, స్థానిక మున్సిపల్ వర్కర్స్ నాయకులు నీలాపు రాజు, అప్పన్న నాగేశ్వరరావు, పెద్దిరాజు పాల్గొన్నారు.

తణుకు రూరల్: సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ రాష్ట్ర ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికుల రాష్ట్ర ప్రచార జాత ఆదివారం ఐదో రోజు పశ్చిమగోదావరి జిల్లాలోకి తణుకు వద్ద ప్రవేశించింది. ఈ సందర్భంగా స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులను, ప్రజలను ఉద్దేశించి ఉమామహేశ్వరరావు మాట్లాడారు. జగన్ ఎన్నికల ముందు పాదయాత్ర సందర్భంగా రాష్ట్రంలోని కాంట్రాక్ట్ కార్మికులను, అవుట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేస్తానని, వారి సమస్యలను పరిష్కరిస్తానని వాగ్దానం చేశారని గుర్తు చేశారు. జగన్ అధికారంలోకి వచ్చి నాలుగేళ్లయినా ఏఒక్క వాగ్దానమూ అమలు చేయలేదని విమర్శించారు. పట్టణాల్లో పెరిగిన జనాభాకు అనుగుణంగా కార్మికుల సంఖ్య పెంచకుండా కార్మికులపై పని భారాన్ని పెంచుతున్నారని అన్నారు. జీతాలు, అలవెన్సులు, పనిముట్లు సకాలంలో ఇవ్వకుండా కార్మికులను బానిసలుగా రాష్ట్ర ప్రభుత్వం పని చేయించుకుంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మిక సమస్యల పరిష్కారం కోసం ఈ జాతా నిర్వహిస్తున్నామని, ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కరించకపోతే రానున్న రోజుల్లో కార్మికులు పెద్దఎత్తున ఉద్యమిస్తారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర నాయకులు బి.సోమయ్య, ధనాల వెంకట్రావు, పి.నూకరాజు, ఎం.వరలక్ష్మి, జి.పోలమ్మ, సిఐటియు జిల్లా నాయకులు పివి.ప్రతాప్, కామన మునిస్వామి, నీలాపు ఆదినారాయణ బాబు, మజ్జి కృష్ణబాబు, పి.నవీన్, కోతపూడి శ్రీను, పుష్ప, కొత్తపల్లి అయ్యప్ప పాల్గొన్నారు.



నరసాపురంలో..



తణకులో

నరసాపురం టౌన్: మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ చేపట్టిన రాష్ట్ర ప్రచార జాతా ఆదివారం నరసాపురం చేరుకుంది. పట్టణంలో 29వ వార్డులో మున్సిపల్ వర్కర్స్ నివాస ప్రాంతాల్లో సభ జరిగింది. సభకు సిఐటియు పట్టణాధ్యక్షులు ముచ్చర్ల త్రిమూర్తులు అధ్యక్షత వహించగా యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.సోమయ్య మాట్లాడారు. కరోనా కష్టకాలంలో ఫ్రంట్‌లైన్ వారియర్స్ గా ప్రాణాలకు తెగించి ప్రజలకు సేవ చేసిన మున్సిపల్ కార్మికుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తుందని విమర్శించారు. వీరికి 010 పద్దు ద్వారా జీతాల చెల్లింపు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు మాట్లాడగా జిల్లా నాయకులు ధనాల వెంకటేశ్వరరావు, బంగారు లక్ష్మి, కె.నాయుడు, బంగారు వరలక్ష్మి, సిఐటియు నాయకులు వంగ సాగర్, నోముల కొండ, పొగాకు నారాయణరావు, పొన్నాడ మల్లేష్, జగన్ పాల్గొన్నారు.

పాలకొల్లు: కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది అందరినీ పర్మినెంట్ చేయాలని, అప్పటి వరకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని మున్సిపల్ కార్మికుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక గాంధీ బొమ్మ సెంటర్ వద్ద నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ సిపిఎస్‌ను రద్దు చేయాలని, పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఆప్కాస్ సిబ్బందికి రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని, వారికి సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర నేతలతోపాటు సిఐటియు మండల కార్యదర్శి జవ్వాది శ్రీనివాసరావు, స్కూల్ స్వీపర్స్ యూనియన్ నాయకులు అంజలి పాల్గొన్నారు.




పాలకొల్లులో..

దళితుల పట్టా భూములు లాక్కోవడం అన్యాయం

బాధితులకు సంపూర్ణ మద్దతు

పాలకొల్లు ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు



ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడుకు వినతిపత్రం సమర్పిస్తున్న చించినాడ ఎస్‌సి బాధితులు

ప్రజాశక్తి - పాలకొల్లు

ఎస్‌సి, ఎస్‌టిలకు ప్రాధాన్యతనిస్తున్నామని చెప్పుకుంటున్న జగన్ ప్రభుత్వం వారి భూములను దౌర్జన్యంగా లాక్కొని పైశాచిక ఆనందం పొందుతున్నారని ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు విమర్శించారు. యలమంచిలి మండలం చించినాడ ఎస్‌సి స్వాధీనంలో 70 సంవత్సరాల నుంచి ఉన్న గోదావరి పెరుగులంక భూముల్లో పోలీసులను అడ్డు పెట్టుకుని తవ్వకాలు సాగించడంపై బాధితులు ఆదివారం స్థానిక ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడును కలిసి గోడు చెప్పుకున్నారు. సిపిఎం నేత కానేటి బాలరాజు నేతృత్వంలో బృందం ఎంఎల్ఎకు సమస్యను వివరించారు. దీనిపై నిమ్మల స్పందిస్తూ బాధితులకు టిడిపి అండగా ఉంటుందని చెప్పారు. రాష్ట్రంలో పోలీస్ రాజ్యానికి కాలం చెల్లిందని, దౌర్జన్యం చేసిన వారు తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. జగన్ ప్రభుత్వం ఇసుక, మట్టి, నీరు ఇలా పంచభూతాలను సైతం దౌర్జన్యంగా లాక్కొని రూ.లక్షల కోట్లు దోపిడీ చేస్తోందని చెప్పారు. మట్టి తీసుకోవడానికి పేదలైన ఎస్‌సి భూములే ఉన్నాయా అని ఎంఎల్ఎ ప్రశ్నించారు. బాధితులకు తాను పూర్తిగా ఉంటాయని ప్రకటించారు.



ఉపాధి కూలీలతో నిరసన తెలుపుతున్న కెవిపిఎస్ మండల కార్యదర్శి

ఉపాధి కూలీలకు 200 రోజులు పని చూపాలి

కెవిపిఎస్ మండల కార్యదర్శి మాదాసి గోపీ

ప్రజాశక్తి - ఉండి

ఉపాధి కూలీలకు సంవత్సరానికి 200 రోజులు పని చూపాలని కెవిపిఎస్ మండల కార్యదర్శి మాదాసి గోపీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఉండి మండలం పాందువ్వలోని దళితవాడలో ఉపాధి కూలీల సమస్యపై కెవిపిఎస్, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా గోపీ మాట్లాడుతూ రెండు పూటలా పని విధానాన్ని రద్దు చేయాలని, రోజుకూలీ రూ.600 ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వేసవి అలవెన్స్ పునరుద్ధరించి కూలీలకు టెంట్లు, మజ్జిగ, తాగునీరు సరఫరా చేయాలని కోరారు. ప్రస్తుతం నాలుగు వారాలు పని చూపారని, ఈ నెల ఐదో తేదీ నుంచి పనుల్లేవని అధికారులు చెబుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు కూలీలకు పనులు చూపేలా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

ఏరువాక వేళ నిరాశలో రైతులు

ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు

ప్రజాశక్తి - పాలకొల్లు

ఏరువాక పౌర్ణమి సందర్భంగా చేలల్లో ఉండాల్సిన రైతులు పండించిన రబీ పంట అమ్ముకోలేక రైస్‌మిల్లుల వద్ద పడిగాపులు పడుతున్నారని ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు చెప్పారు. ఆదివారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏరువాక వేళ ఆనందంగా ఉండాల్సిన రైతులు జగన్ ప్రభుత్వంలో నిరాశ, నిస్పృహతో ఉన్నారన్నారు. ఖరీఫ్‌కు ఏరువాకతో పంటను ప్రారంభించాల్సిన రైతులు బతుకుజీవుడా అంటూ ధాన్యం అమ్ముకోలేక రోజులు తరబడి రైస్‌మిల్లుల దగ్గర పడిగాపులు కాస్తున్నారని తెలిపారు. నాడు ధాన్యం అమ్మితే రైతులకు డబ్బులు వచ్చేవని, నేడు ధాన్యం అమ్మాలంటే ఎదురు డబ్బు రైస్‌మిల్లులకు కట్టాల్సి రావడం దారుణమన్నారు. కష్టాల్లో ఉన్న అన్నదాత దగ్గర కూడా బస్తాకు 10 కేజీల ధాన్యం అదనంగా దోచుకోవడం జగన్‌కే చెల్లిందని విమర్శించారు. జగన్ పాలనలో రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయి క్రాప్‌హాలిడే బాట పడుతున్నారన్నారు. రైతుభరోసా కేంద్రాలు రైతు భక్షక కేంద్రాలుగా, రైతు దగా కేంద్రాలుగా తయారయ్యాయని చెప్పారు. ప్రతి రైతుకూ రూ.20 వేలు ఆర్థిక సాయం ఇస్తానన్న చంద్రబాబుతోనే రాష్ట్రంలో రైతు రాజ్యం సాధ్యమన్నారు. మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్, నియోజకవర్గ పరిశీలకులు చంద్రమౌళి, బోనం నాని, మామిడిశెట్టి పెద్దిరాజు, చెరుకూరి అంజిబాబు పాల్గొన్నారు.

డిఇఇ హామీతో దీక్ష విరమణ

సమస్య పరిష్కరించకుంటే మళ్లీ దీక్ష చేస్తాం : ఎంఎల్ఎ

ప్రజాశక్తి - ఆకివీడు

సుమారు ఎనిమిది గంటల అనంతరం ఎంఎల్ఎ మంతెన రామరాజు ట్రాన్స్కో డిఇఇ పీర్ అహ్మద్ ఖాన్ హామీతో దీక్షను విరమించారు. ఆకివీడు పట్టణంలోని ఆరో వార్డులో విద్యుత్ సమస్య పరిష్కరించేందుకు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని ఎంతోకాలం నుంచి అక్కడ స్థానికులు, కౌన్సిలర్ సైతం కోరుతున్నారు. అయితే ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మ లేదంటూ వాయిదా వేయడంతో స్థానికులు కౌన్సిలర్ సమన్వయంతో అక్కడ దిమ్మ నిర్మించారు. ఆ దిమ్మపై ట్రాన్స్‌ఫార్మర్‌ను విద్యుత్ శాఖ ఏర్పాటు చేసింది. అయితే ఎన్ని రోజులు గడిచినా విద్యుత్ కనెక్షన్ మాత్రం ఇవ్వలేదు. అయితే ఏర్పాటుకు ముందే అక్కడ కౌన్సిలర్ గుర్రాని నాగలక్ష్మి దిమ్మ ప్రారంభ సూచకంగా కొబ్బరికాయ కొట్టారు. కొబ్బరికాయ కొట్టడాన్ని తప్పుపడుతూ విద్యుత్ శాఖ అధికారులు ఆమెపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ రకంగా విద్యుత్ శాఖ అధికారులు తమను అవమాన పరచడమే కాకుండా, ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు విద్యుత్ కనెక్షన్ ఎందుకు ఇవ్వడం లేదంటూ టిడిపి నాయకులు రెండుసార్లు అధికారులను గతంలో ప్రశ్నించారు. అయినప్పటికీ ఫలితం లేకపోవడంతో శనివారం సాయంకాలం 6 గంటల నుంచి నిరసన దీక్ష ప్రారంభించారు. వంట, భోజనాలు సైతం విద్యుత్ కార్యాలయ ప్రాంగణంలోనే చేశారు. అక్కడే కార్యకర్తలు అందరూ కలిసి రాత్రి బస్ చేశారు. అప్పటికే స్థానిక ఎఇ ప్రసాద్ రాజు మాట్లాడినప్పటికీ ఎంఎల్ఎ సంతృప్తి చెందలేదు. మీ హామీ అమలు జరగడం లేదు మాకు అక్కర్లేదంటూ దీక్ష కొనసాగించారు. అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో డిఇఇ అహ్మద్‌ఖాన్ భీమవరం నుండి వచ్చి ఎంఎల్ఎ రామరాజుతో మాట్లాడారు. కౌన్సిలర్‌పై పోలీసులకు ఫిర్యాదు చేశామని కేసు నమోదు కాలేదని తెలిపారు. ఫిర్యాదు ఒకసారి ఎంచుకుంటామని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు విద్యుత్ కనెక్షన్ సోమవారం సాయంకాలం లోపల ఇస్తామని ఆయన హామీ ఇచ్చారు. దీక్ష విరమించిన రామరాజు మాట్లాడుతూ హామీ నూరుశాతం అమలు చేయాలని, లేని పక్షంలో మంగళవారం ఉదయం నుండి తిరిగి దీక్ష ప్రారంభిస్తామని ప్రకటించారు.



ఎంఎల్ఎ రామరాజుకు నిమ్మరసం ఇచ్చిన దీక్ష విరమింపజేస్తున్న డిఇఇ



సముద్ర స్నానాలు చేస్తున్న పర్యాటకులు

సాగరతీరం.. కోలాహలం

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని పేరుపాలెం బీచ్ వద్ద ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. బీచ్‌కు పర్యాటకులు, ప్రకృతి ప్రేమికులు అధిక సంఖ్యలో ప్రత్యేక ద్విచక్ర వాహనాల్లో ఉదయమే తరలివచ్చారు. పలువురు సముద్ర కెరటాల్లో స్నానాలు చేశారు. చిన్నారులు ఒడ్డుకు కొట్టుకుపోతున్న కెరటాలతో ఇసుక తేనెలపై ఆటలాడుకున్నారు. ఒడ్డున ఉన్న ఆలయాలను దర్శించుకుని సర్వే తోటల్లో సహపంక్తి భోజనాలు చేసి సేద తీరారు.


పెదఅమిరం మురుగు కాలువలో చేపడుతున్న పూడికతీత పనులు

మురుగు కాలువ ప్రక్షాళన పనులు

ప్రజాశక్తి - కాళ్ల

పెదఅమిరం గ్రామంలో మురుగు కాలువ ప్రక్షాళన పనులు చేపడుతున్నామని గ్రామ సర్పంచి దొమ్మ సోమేశ్వరరావు ఆదివారం తెలిపారు. నాలుగు కిలోమీటర్ల పొడవునా మురుగు కాలువలో పూడికతీత పనులు చేపడుతున్నామన్నారు. కాలువల ద్వారా నీటి సరఫరా చేస్తున్న దృష్ట్యా రైతులకు నీటి సమస్య తలెత్తకుండా మురుగు కాలువ పనులు చేస్తున్నామన్నారు. వర్షాకాలంలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తుగా ఈ పనులు చేపడుతున్నామన్నారు. ఇంకా ఈ పనులు నాలుగు రోజులపాటు కొనసాగుతాయన్నారు.

ఆకివీడు ఎండిఓగా వాణి

ప్రజాశక్తి - ఆకివీడు


బాధ్యతలు స్వీకరిస్తున్న ఎండిఓ కందుల వాణి

ఎట్టకేలకు ఆకివీడు ఎండిఓ స్థానం భర్తీ అయ్యింది. సుమారు మూడు సంవత్సరాలుగా ఈ స్థానం ఖాళీగా ఉంది. కందుల వాణి ఆకివీడు ఎండిఓగా ఆదివారం బాధ్యతలు చేపట్టారు. 5 సంవత్సరాల నుంచి నల్లజర్లలో ఎండిఓగా పనిచేస్తున్న ఆమె బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇప్పటి వరకూ ఈ స్థానంలో స్థానిక కార్యాలయ పరిపాలన అధికారి ఎం.శ్రీకర్ సుమారు మూడేళ్లుగా పూర్తి అదనపు బాధ్యతలతో ఎండిఓ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. చాలా కాలంగా ఇక్కడ ప్రధాన అధికారుల స్థానాలన్నీ ఖాళీగానే ఉన్నాయి. ముందుగా ఎండిఓ స్థానం భర్తీ అయ్యింది.

బస్సు కిందపడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - తణుకు

ఆర్‌టిసి బస్సు కింద పడి తీవ్ర గాయాలు పాలైన వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం తణుకులో చోటుచేసుకుంది. తణుకు ఆర్‌టిసి బస్టాండ్ ఆవరణలో మతిస్థిమితం లేకుండా తిరుగుతున్న బీహార్ రాష్ట్రానికి చెందిన కిస్కు రూపాల్ (24) ప్రమాదవశాత్తు బస్సు కింద పడ్డాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రూపాల్‌ను 108 వాహనంలో తణుకు జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. అతను గత కొంతకాలంగా మతిస్థిమితం లేకుండా తిరుగుతున్నట్లు తెలిసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


అంబేద్కర్ విగ్రహావిష్కరణ పత్రిక విడుదల చేస్తున్న దళిత నాయకులు

6న అంబేద్కర్ విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి - వీరవాసరం

ఈ నెల 6వ తేదీన భీమవరం అంబేద్కర్ చౌక్ వద్ద బిఆర్ అంబేద్కర్ కాంస్య విగ్రహావిష్కరణలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని ఎపిఎస్‌సి వెల్ఫేర్ అసోసియేషన్ భీమవరం శాఖ వీరవాసరం మండల నేతలు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు విగ్రహావిష్కరణ ఆహ్వాన పత్రికను ఆదివారం కొయ్యే సుందర్రాజు ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దళిత నాయకుల నేత సుందర్రాజు, కటం స్వర్ణరాజు, వీరవాసరం సర్పంచి చికిలే మంగతాయారు మాట్లాడుతూ ప్రభుత్వ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు దళితులకు దక్కిన గౌరవంగా భావిస్తున్నామన్నారు. వీరవాసరం మండలం నుంచి కుల, మత, వర్గాల అతీతంగా ఈ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో బొంతు రమేష్, పత్తెల సాల్మన్‌రాజు, నాని పాల్గొన్నారు.


శంకుస్థాపన చేస్తున్న పివిఎల్ నరసింహరాజు

ఉండి నియోజకవర్గ అభివృద్ధికి కృషి

డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు

ప్రజాశక్తి - పాలకోడేరు

ఉండి నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించినట్లు డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు అన్నారు. మోగల్లులోని సచివాలయం-2 పరిధిలోని వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్ భవన నిర్మాణానికి ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్థాయిలో ప్రాథమికంగా వైద్య సేవలందించాలనే ఉద్దేశంతో వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్ భవనాలు నిర్మించడం జరుగుతుందన్నారు. రూ.17.50 లక్షలతో ఈ భవనం నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. ఆగస్టు నెలాఖరుకల్లా భవన నిర్మాణం పూర్తవుతుందన్నారు. ఇప్పటికే సచివాలయం-1 పరిధిలో భవన నిర్మాణం తుది దశకు చేరుకుందన్నారు. నియోజకవర్గంలో అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయని, ప్రజలకు నిరంతర సేవలందించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలూ తీసుకుంటోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసిలు కాటూరి శాంతకుమారి, పెన్మత్స వెంకటలక్ష్మి, పార్టీ యువజన విభాగం మండల అధ్యక్షులు పెన్మత్స వెంకటరాజు (బాబు) పెన్మత్స నాగరామకృష్ణంరాజు, మంతెన బాపిరాజు, ఉప సర్పంచి పెన్మత్స సీతారామరాజు, బలే చిట్టిబాబు, సైదు శివలింగేశ్వరరావు, జి.సత్యకృష్ణ పాల్గొన్నారు.

విద్యుత్ కోతలతో ఉక్కిరిబిక్కిరి

ప్రజాశక్తి - పెనుమంట్ర

వేసవి తాపానికి సామాన్యులతో పాటు ఉద్యోగులు కూడా విలవిల్లాడిపోతున్నారు. అటు ఉష్ణోగ్రతలు పెరగడమే కాకుండా, ఇటు కరెంటు కోతలు తోడవ్వడంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. విద్యుత్ కోతలతో ఉద్యోగస్తులకు సైతం విధులకు ఆటంకంగా మారుతోంది. ముఖ్యంగా పొలమూరులో విద్యుత్ కోతల నేపథ్యంలో సచివాలయ ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే భానుడి ప్రతాపానికి ఉదయం 10 గంటలు దాటితే రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. సాయంత్రం నాలుగు గంటలు దాటితే తప్ప సామాన్యులు బయటకు రాని పరిస్థితి నెలకొంది.


చెత్త డంపింగ్‌తో పూడుకుపోతున్న చినకాపవరం డ్రెయిన్


ఆకివీడు, సిద్ధాపురం నడిరోడ్డుపై వేసిన చెత్తకు పెట్టిన నిప్పు

చెత్తంతా డ్రెయిన్లోనే..

పూడుకుపోతున్న చినకాపవరం డ్రెయిన్
చెత్తకు నిప్పు పెట్టడంతో పరిసర ప్రాంతాలను కమ్మేస్తున్న పొగ
స్థానికుల అవస్థలు
పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - ఆకివీడు

ఆకివీడు పట్టణ ప్రజల పాలిట చెత్త సమస్య శాపంగా మారింది. పంచాయతీ స్థాయిలో సమస్య మొదలై నేడు నగర పంచాయతీ స్థాయికి చేరినా పరిష్కారం కాని పరిస్థితి నెలకొంది. ఏళ్ల తరబడి చెత్త సమస్య ఆకివీడును పట్టిపీడిస్తోంది. రోజురోజుకూ సమస్య పెరుగుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆకివీడు నుంచి సిద్ధాపురం వెళ్లే రోడ్డులో చినకాపవరం డ్రెయిన్‌పై వంతెన వద్ద పట్టణంలోని చెత్త మొత్తం తీసుకొచ్చి నగర పంచాయతీ వారు వేసేస్తున్నారు. దీంతో సుమారు 45 అడుగుల వెడల్పున్న సిద్ధాపురం రోడ్డు బక్కచిక్కి ప్రస్తుతం పది అడుగులకు చేరింది. తారు రోడ్డు మొత్తం చెత్తకుప్పల మయంగా మారింది. ఈ వంతెనను అనుకుని సుమారు 200 నుంచి 300 కుటుంబాలు నివసిస్తున్నాయి.

చెత్తకు నిప్పు.. జనం, వాహనదారుల అవస్థలు

రోజూ ఇక్కడ చెత్తకు నిప్పు పెడుతుంటారు. దీంతో ఆ ప్రాంతం మొత్తం దట్టమైన పొగతో నిండిపోతోంది. ఈ నేపథ్యంలో ఆ రోడ్డు గుండా ఎదురెదురుగా వచ్చే వాహనాలు కనపడని పరిస్థితి నెలకొంది. ఒక దశలో ఇళ్లల్లో వారు కూడా ఒకరికి ఒకరు కనిపించని స్థాయిలో పొగ కమ్మేస్తోందని స్థానికులు వాపోతున్నారు. ఇటీవల పొగ ప్రభావానికి అనేక మంది అస్వస్థతకు గురయ్యారు. ఈ రోడ్డు గుండా సిద్ధాపురం, చినమిల్లిపాడు, కోళ్లపర్రు, రాజులపేట, కళింగగూడెం, నందమిల్లిపాడు, కొల్లేరు గ్రామాల ప్రజలు, రైతులు, చేపల చెరువుల యజమానులు, కార్మికులు ప్రతినిత్యం వందలాదిగా రాకపోకలు సాగిస్తుంటారు. అయితే పొగకు పలు సార్లు ప్రమాదాలకు గురైన సందర్భాలు కూడా ఉన్నాయి.

చెత్తంతా ఇక్కడే వేసేయడంతో చినకాపవరం డ్రెయిన్ పూడుకుపోతోంది. కోస్తా జిల్లాల్లోనే అతిపెద్ద మీడియం డ్రెయిన్ ఇది. ఈ డ్రెయిన్ ద్వారా సుమారు పది మండలాల్లోని మురుగు నీటిని ఉప్పుటేరు గుండా కొల్లేటిలోకి చేరుస్తుంది. ఈ కాలువకు అడ్డంకులు ఏర్పడితే పది మండలాల్లోని పంట నాశనం అవుతోంది. ఇంతటి ప్రాముఖ్యత కలిగిన ఈ డ్రెయిన్ ఆకివీడు చెత్తతో పూడుకుపోతోంది. అయినా అధికారులకు చీమకుట్టినట్లు కూడా లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో చెత్త డంపింగ్‌కు కోసం ప్రత్యేక స్థలం చూడాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అయినా పట్టించుకోని పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెత్త సమస్యను పరిష్కరించాలని కోరారు.

జనసేన నేతలకు బుద్ధి చెబుతాం : వైసిపి బిసి నేతలు

ప్రజాశక్తి - వీరవాసరం

బిసి నాయకులంటే చులకన భావంతో ఉన్న జనసేన నేతలకు తగు రీతిలో బుద్ధిచెబుతామని వైసిపి బిసి వీరవాసరం మండల నేతలు హెచ్చరించారు. ఈ మేరకు ఆదివారం పార్టీ బిసి నేతలు గూడూరి ఓంకారం, వ్యవసాయ సలహామండలి ఛైర్మన్ గొలగాని సత్యనారాయణ, తోకలపూడి సర్పంచి వీరవల్లి శ్రీనివాసరావు, ఎఎంసి మాజీ వైస్ ఛైర్మన్ పాలా లక్ష్మీకుమారి, ఎఎంసి డైరెక్టర్ మతల కాశీ, డివిడి ప్రసాద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. గతంలో ఏ పార్టీ వ్యవహరించని ధోరణిలో జనసేన నాయకులు వ్యవహరిస్తున్నారన్నారు. ఆ పార్టీలో యువతను పెడదోవ పట్టించే విధంగా జిల్లా నాయకులు కొటికలపూడి గోవిందరావు (చినబాబు) తీరు ఉందన్నారు. ఒక ఎంఎల్ఎను బాడీషేమింగ్ చేస్తూ జనసేన కార్యకర్త బండారు మణికంఠ సోషల్ మీడియాలో పోస్టులు పెడితే పోలీస్‌స్టేషన్‌లో ఉన్న ఆ యువకుడిని మందలించడం మాని భీమవరం నుండి చినబాబు తన అనుచరవర్గంతో వీరవాసరం పోలీస్ స్టేషన్‌కు వచ్చి హంగామా చేయడం వారి దురుసుతనానికి అర్థపడుతుందన్నారు. సమస్యను సామరస్య పూర్వకంగా పరిష్కరించుకోవడానికి వచ్చిన వైసిపి బిసి నేతలను చినబాబు కించపరిచే విధంగా మాట్లాడడాన్ని ఖండించారు. తక్షణం చినబాబు బిసి నేతలకు క్షమాపణ చెప్పాలన్నారు. లేని పక్షంలో భీమవరంలో చినబాబు ఇంటిని ముట్టడిస్తామంటూ హెచ్చరించారు. ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ చేస్తున్న అభివృద్ధిని ఓర్వలేని తనంతో ఆయనను బాడీషేమింగ్ చేస్తూ జనసేన నాయకులు దిగజారారన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి కందుల వెంకటేశ్వరరావు, ఎంపిటిసిలు వీరవల్లి ఉషా, బోను జోత్స్నాదేవి, వైసిపి నాయకులు నూకల కనకారావు, భీశెట్టి కోటేశ్వరరావు, కోడి అప్పారావు, వీరవల్లి రాధాకృష్ణ, గూడూరి కొండ పాల్గొన్నారు.

రీ సర్వేతో భూ సమస్యలు పరిష్కారం

ప్రజాశక్తి - ఆచంట


కొడమంచిలిలో జగనన్న భూ సర్వే, డ్రోన్ కెమెరాను ప్రారంభిస్తున్న సర్పంచుల ఛాంబర్ మండల అధ్యక్షులు సుంకర సీతారామ్

దశాబ్దాల నాటి భూ సమస్యలకు జగనన్న భూ హక్కు, భూ రక్ష, రీ సర్వేతో మోక్షం కలుగుతుందని సర్పంచుల ఛాంబర్ మండల అధ్యక్షులు సుంకర సీతారామ్ అన్నారు. ఆదివారం కొడమంచిలిలోని జిల్లా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో డ్రోన్ కెమెరాను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా రీ సర్వేను చేపట్టి ఎటువంటి వివాదాలు లేని భూములను రైతులకు భూ యజమానులకు అప్పగించేందుకు చర్యలు చేపట్టిందన్నారు. దీంతో దశాబ్దాల నాటి భూ సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. ఈ నేపథ్యంలో ప్రజల దశాబ్దాల కల సహకారం అవుతోందన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా భూముల రీ సర్వేకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టగా పారదర్శకంగా కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. రీ సర్వేలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నారని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఈ సర్వేకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సుబ్రహ్మణ్యం, డిప్యూటీ తహశీల్దార్ రాజ్యలక్ష్మి, విఆర్ఒలు సీతారాం, సూర్యనారాయణ నరసింహరాజు, రాజబాబు పాల్గొన్నారు.

నూతన వేతన ఒప్పందం కోసం కమిటీకి సహకరిస్తాం

ఇయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సయ్య

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ఆర్‌టిసి కార్మికులు, ఉద్యోగులకు నూతన వేతన ఒప్పందం కోసం యాజమాన్యం కమిటీ ఏర్పాటు చేస్తే ఎంప్లాయీస్ యూనియన్ పూర్తిగా సహకరిస్తుందని కమిటీ ఇచ్చిన రిపోర్ట్‌పై యాజమాన్యంతో యూనియన్లుగా మాట్లాడతామని ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి జి.నర్సయ్య అన్నారు. ఆదివారం ఎంప్లాయీస్ యూనియన్ భీమవరం డిపో సెక్రటరీ చినమిల్లి శ్రీనివాసులు నూతన గృహప్రవేశం సందర్భంగా ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఎంప్లాయీస్ యూనియన్ నాయకత్వం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల ఆర్‌టిసి ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర మహాసభలు విజయవాడలో జరిగాయని, ఈ మహాసభలో రాష్ట్రంలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించామని, వాటిని యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. అధ్యక్షులు పోలిశెట్టి దామోదర్‌రావు మాట్లాడుతూ రాష్ట్ర విభజన, ఆర్‌టిసి ప్రభుత్వంలో విలీనం అనంతరం కార్మికుల సమస్యలు పెరిగాయని, కార్మికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. నూతనంగా ఏర్పాటైన జిల్లాల్లో 16 శాతం ఇంటి అద్దె కోసం యాజమాన్యంతో మాట్లాడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ఎండి.ప్రసాద్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్‌వి.రావు, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎమ్‌డి.ఆలీ, జోనల్ కార్యదర్శి వైఎస్.రావు, జోనల్ నంబరు బి.అరుణ, ఎస్ఎస్.రావు తదితరులు శుభాకాంక్షలు తెలిపారు. నూతన గృహ ప్రవేశానికి ప్రత్యేక అతిథిగా డిపో మేనేజర్ ఎస్.గిరిధర్ కుమార్, అసిస్టెంట్ మేనేజర్ సురేష్, ఇయు డిపో అధ్యక్షులు ఆర్‌వి.రాజు, కార్యదర్శి సిహెచ్.శ్రీనివాసులు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.సీతారాం ప్రసాద్ శుభాకాంక్షలు తెలిపారు.

సినీ సంగీత జగత్తులో ధృవతార ఎస్‌పి బాలు

ప్రజాశక్తి - భీమవరం రూరల్


బాలసుబ్రహ్మణ్యం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సభ్యులు

మధుర గాయకులు, సినీ జగత్తులో ధృవతార ఎస్‌పి బాల సుబ్రహ్మణ్యం జయంతిని అంకాల అకడమీ ఆర్ట్స్ భవనంలో ఆదివారం స్వచ్ఛంద సంస్థలతో నిర్వహించారు. అకడమీ కోశాధికారి గోపా సత్యనారాయణ బాలు చిత్రపటానికి పూలమాలలు వేసి మాట్లాడారు. యుగాంతం వరకూ ముద్రలు ఎస్‌పి బాలు పాటలని తెలిపారు. శోభన్‌బాబు కల్చరల్ అసోసియేషన్ నాయకులు భట్టిప్రోలు శ్రీనివాసరావు మాట్లాడుతూ భీమవరం చైతన్య భారతీ నాటిక పరిషత్ బాలును పిలిచి సత్కరించారని, అందరినీ ఆప్యాయతగా పలుకరించే బాలు ఆకస్మికంగా మరణించడం అందరినీ కలిచి వేసిందని తెలిపారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ తన గళంతో ప్రపంచంలో భారత దేశ ఖ్యాతిని ఇనుమడింప చేసిన బాలు చివరి కోరిక తిక్కన సోమయాజీ విగ్రహం నెల్లూరులో ప్రతిష్టించాలనే విషయాన్ని ప్రభుత్వం నెరవేర్చినప్పుడే నిజమైన నివాళులని అన్నారు. కార్యక్రమంలో ఉండపల్లి రమేష్ నాయుడు, కె.శిరీష, పరిమి రామకృష్ణ, గ్రంధి మూర్తి, ఎండి సరోజినీ, కొండ్రు శ్రీనివాస్ పాల్గొన్నారు.



ప్రయివేటు ఎసి బస్ ఛార్జీలకు రెక్కలు

పాలకొల్లు నుంచి హైదరాబాద్‌కు రూ.3 వేల పైనే
ప్రయాణికుల ఆందోళన

ప్రజాశక్తి - పాలకొల్లు

రాష్ట్రంలో ఒక పక్క ఎండలు మండిపోతుంటే అదే అదునుగా ప్రయివేటు ఎసి బస్సుల యాజమాన్యాలు ఛార్జీలను దారుణంగా పెంచేస్తున్నారు. ఒకపక్క వివాహ వేడుకలు కావడం, మరోపక్క తీవ్ర ఎండల నేపథ్యంలో పాలకొల్లు నుంచి హైదరాబాద్ వెళ్లే ఎసి బస్సుల ఛార్జీలు పండుగ రోజుల్లో కంటే అధికంగా వసూలు చేస్తున్నారు. ఒక్కో టిక్కెట్ సాధారణంగా రూ.800 నుంచి రూ.1000 ఉండగా ప్రస్తుతం రూ.3000 నుంచి రూ.3500 మధ్య వసూలు చేస్తున్నారంటే ప్రయివేటు ట్రావెల్స్ దోపిడీ ఏ స్థాయిలో ఉందో అర్థమవుతుంది. దీనికితోడు శనివారం ఒరిస్సా రాష్ట్రంలో రైలు ప్రమాదం నేపథ్యంలో కొందరు రైలు ప్రయాణాలకు భయపడడంతో దీన్ని వీరు ఆసరాగా తీసుకుంటున్నారు. శని, ఆదివారాలు ఎసి బస్ టికెట్ ధర 3200 అంటూ వసూలు చేస్తున్నారు .రైలు ప్రయాణం ఆలస్యమవుతున్న నేపథ్యంలో ప్రయివేట్ బస్ ఛార్జీలకు రెక్కలొచ్చాయి. విమాన ధర వసూలు చేస్తున్నారని పలువురు విమర్శిస్తున్నారు. అయినా రవాణా శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆదర్శ నేత సత్యవతి

ఐద్వా జిల్లా కార్యదర్శి పూర్ణ

ప్రజాశక్తి - ఆకివీడు

మహిళా ఉద్యమాల్లో ముందు భాగాన నిలిచిన ఆదర్శ నేత బొక్కా సత్యవతి అని ఐద్వా జిల్లా కార్యదర్శి పి.పూర్ణ కొనియాడారు. సత్యవతి రెండో వర్ధంతి సభ ఆదివారం స్థానిక జవహర్‌పేటలో సంఘం మండల అధ్యక్షురాలు డోకల లక్ష్మీ అధ్యక్షతన నిర్వహించారు. తొలుత సత్యవతి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ముఖ్యఅతిథి పూర్ణ మాట్లాడుతూ సమస్యల పట్ల పూర్తి అవగాహనతో ముందడుగు వేసి ఫలితం సాధించే వరకు అలుపెరుగని పోరాటం సత్యవతి సాగించేవారన్నారు. మహిళలకు ఎక్కడ అన్యాయం జరిగినా ఆమె ముందు భాగంలో ఉండి పోరాడేవారన్నారు. ప్రస్తుతం సమాజంలో మహిళలపై రోజురోజుకీ అన్యాయాలు, అక్రమాలు, లైంగిక వేధింపులు పెరిగిపోతున్నా ప్రభుత్వాలు మొద్దు నిద్ర నటిస్తున్నాయన్నారు. మహిళల సమస్యలపై పోరాటమే సత్యవతికి నిజమైన నివాళి అని అన్నారు. కార్యక్రమంలో గేదెల లావణ్య, ఎస్‌కె.వలీ, బొక్కా సత్యనారాయణ, తవిటి నాయుడు, పెంకే అప్పారావు, డోకల రవితేజ పాల్గొన్నారు.


వర్ధంతి సభలో మాట్లాడుతున్న ఐద్వా జిల్లా కార్యదర్శి పి.పూర్ణ

చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి - తణుకు

టిడిపి మహానాడులో అన్నదాత పథకం కింద రైతులకు ఏడాదికి రూ.20 వేలు టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ప్రకటించడం పట్ల పార్టీ శ్రేణులు, రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆదివారం మాజీ ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ ఆధ్వర్యంలో నియోజకవర్గ రైతులు చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని తెలిపారు. చంద్రబాబు సిఎంగా ఉండగా 15 శాతం వృద్ధి ఉంటే ఐదు శాతానికి పడిపోయిన పరిస్థితి ఏర్పడిందన్నారు. రైతు భరోసా కేంద్రాల పేరుతో ప్రభుత్వం రైతులను మోసం చేస్తోందని విమర్శించారు. ఈ సమావేశంలో నాయకులు కలగర వెంకటకృష్ణ, ఆనాల ఆదినారాయణ, పితాని మోహన్‌రావు, భాస్కరరావు, నాగు పాల్గొన్నారు.

నేడు పేరుపాలెం బీచ్ క్లీనింగ్

ప్రజాశక్తి - భీమవరం

ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం ఉదయం 6 గంటలకు పేరుపాలెం తీరంలో క్లీనింగ్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు సమాచార శాఖ అధికారులు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సుమారు 800 మంది పాల్గొనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టరు పి.ప్రశాంతి, జిల్లా ఎస్‌పి యు.రవిప్రకాష్, సబ్ కలెక్టర్ ఎం.సూర్యతేజ పాల్గొనున్నారని తెలిపారు.

ముత్యాలమ్మ ఆలయం కిటకిట

ప్రజాశక్తి - మొగల్తూరు

ముత్యాలపల్లి గ్రామంలో బండి ముత్యాలమ్మ అమ్మవారి ఆలయం ఆదివారం యాత్రికులతో కిటకిటలాడింది. యాత్రికులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కానుకలు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి దెందుకూరి రామకృష్ణంరాజు, ఛైర్మన్ కొల్లాటి రామారావు పర్యవేక్షణలో ఆలయ సిబ్బంది, పాలకవర్గ సభ్యులు యాత్రికులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేశారు. ప్రసాద వితరణ తదితర సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

'గొడవలు సృష్టించడమే ఎంఎల్ఎ ఉద్దేశం'

ప్రజాశక్తి - వీరవాసరం

సంబంధంలేని విషయాలను తనకు ఆపాదించుకుని వీరవాసరం మండలంలో గొడవలు సృష్టించడమే భీమవరం ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ ఉద్దేశమని జెడ్‌పిటిసి గుండా జయ పకాష్‌నాయుడు ఆరోపించారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత రెండు రోజులుగా సోషల్ మీడియాలో జనసైనికుడు పెట్టిన పోస్టు వల్ల జరిగిన పరిణామాలపై ఆయన మాట్లాడారు. ఇప్పటికే వీరవాసరం మండలంలో మూడు గ్రామాల్లో మత్స్యపురి, కొణితివాడ, దూసనపూడిలో వలే వీరవాసరంలో కూడా గొడవలు సృష్టించాలన్నదే ఎంఎల్ఎ ఉద్దేశంగా ఉందన్నారు. నన్ను ఉద్దేశించి పెట్టిన పోస్టును ఎంఎల్ఎ ఆపాదించుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. భీమవరం తన సోదరి నివాసానికి అనుమతులు రాకుండా ఎంఎల్ఎ అడ్డుకోవడం, ప్రజలను భయభ్రాంతులకు గురి చేయడం వంటి పరిణామాలు ఎంఎల్ఎ నైజాన్ని తెలియజేస్తుందన్నారు. ఇతర మండలాల్లో ఎంపీ నిధులతో రూ.1.5 కోట్లతో అభివృద్ధి జరిగితే ఎంఎల్ఎ వల్ల మండలంలో ఆ పరిస్థితి లేదన్నారు. తనపై ఎన్ని కేసులు పెట్టినా భయపడేది లేదన్నారు. మండలంలో అన్ని సామాజిక తరగతుల అండతో తాను జెడ్‌పిటిసిగా విజయం సాధించానని తెలిపారు. తమ పార్టీ నాయకులు బిసిల పట్ల ఏమైనా తప్పుగా మాట్లాడితే వారి తరుపున నేను క్షమాపణ చెబుతున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి అడ్డాల శ్రీరామచంద్రమూర్తి, ఎంపిటిసిలు కందుకూరి విజయకుమారి, గోడి ఆదిలక్ష్మి, కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ యస్తాన్‌వళి, గుండా బాబు పాల్గొన్నారు.

ఓణీల వేడుకలో మోషేనురాజు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

భీమవరం ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో ఆదివారం జరిగిన శ్రీ పడమటి దుర్గారావు వారి కుమార్తెల ఓణీల వేడుకకు శాసన మండలి ఛైర్మన్ కొయ్యే మోషేనురాజు, ఆయన కుమారుడు కొయ్యే సుందర్‌రాజు, కృష్ణ పాల్గొన్నారు. చిన్నారులను ఆశీర్వదించారు.

ఉచిత వైద్య సేవా కేంద్రాన్ని వినియోగించుకోండి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

సాధారణ వ్యాధులు, మహిళల ఆరోగ్య సమస్యలకు సంబంధించి ప్రతిరోజూ సాయంత్రం మెంటేవారితోటలోని అల్లూరి సీతారామరాజు, భగత్‌సింగ్ వైద్య సహాయ కేంద్రం (సుందరయ్య భవనం)లో వైద్య సేవలు అందిస్తున్నామని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని వసుధ ఫౌండేషన్ కన్వీనర్ ఇందుకూరి ప్రసాదరాజు కోరారు. ప్రతి మంగళవారం ఉదయం గుండె సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న వారికి గుండె వైద్య నిపుణులు సేవలందిస్తారన్నారు. అవసరమైన వారికి ఇసిజి, ఎకో వంటి పరీక్షలు ఉచితంగా చేస్తారన్నారు. ఉచిత పరీక్షలు, చికిత్సను ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

పేకాట శిబిరంపై దాడి

ప్రజాశక్తి - పాలకోడేరు

విస్సాకోడేరులో పేకాట శిబిరంపై పాలకోడేరు పోలీసులు ఆదివారం దాడి చేశారు. ఈ దాడిలో ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.2700 నగదు స్వాధీనం చేసుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు.